

రూ.28.38లక్షల పరిహారం విడుదల

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 8: గత ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు ఆరో తేదీ వరకు కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు పంట నష్టపోయిన వారికి ఎకరానికి రూ.10వేల చొప్పున నష్టపరిహారం ఇస్తామని ప్రకటించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ అధికారులు పంటనష్ట పోయినవారి వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపారు. ఇందులో భాగంగా మంగళవారం రాష్ట్రంలోని 28 జిల్లాలకు పంటనష్ట పరిహారాన్ని విడుదల చేసింది. ఇందులో వరంగాల్ జిల్లాలో 283.34 ఎకరాలలో 480 మంది రైతులు పంట నష్టం జరిగింది. వీరికి ఎకరానికి రూ.10వేల చొప్పున రూ. 28,38,500 ప్రభుత్వం విడుదల చేసింది.

పల్లెలకు పైసలొచ్చినయ్

పంచాయతీలకు కాస్తంత ఊపిరి పోసిన రాష్ట్ర ప్రభుత్వం



- ఉమ్మడి జిల్లా జీపీలకు రూ.20కోట్ల పైచిలుకు మంజూరు
- జనాభా ఆధారంగా కేటాయింపు
- ఒకట్రెండురోజుల్లో ఖాతాల్లో జమ
- 'స్వచ్ఛదనం- పచ్చదనం'కు వినియోగించాలని సూచన



హనుమకొండ టౌన్, అక్టోబరు 8: నిధులు లేమితో తల్లడిల్లుతున్న పల్లెలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసి ప్రాణం పోసింది. ఇప్పటికే గ్రామ పంచాయతీల ఖాతాలో చెక్కులు పడగా ఒకటి రెండు రోజుల్లో ఆ నిధులు మంజూరు కానున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ జిల్లాల గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులకు మోక్షం కలగనుంది. అయితే ఈ నిధులను గ్రామ పంచాయతీ కార్మికులతో పాటు వాహనాల ఈఎంఐ, 'స్వచ్ఛదనం- పచ్చదనం'కు వినియోగించాలని సర్కారు షరతు విధించింది.

చాలా రోజులకు..

కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ నిధులు నిలిపివేసినప్పటి నుంచి పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. దానికి తోడు పంచాయతీల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో ఇంటికి పెద్ద దిక్కు లేకుండాపోయింది. అప్పటి నుంచి పల్లెల బాగోగులు పట్టించుకునే నాథులు లేకుండాపోయారు. దీంతో పల్లెల్లో అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది. పల్లె అభివృద్ధి భారమంతా కార్యదర్శులపై పడడంతో వారికి తలకు మించిన భారమైంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో ఎట్టకేలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,688 గ్రామ పంచాయతీలకు సుమారు రూ.20 కోట్లు పైచిలుకు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

జనాభా ఆధారంగా నిధులు

ఆగస్టు 5న 'స్వచ్ఛదనం - పచ్చదనం' పేరుతో ఐదు రోజుల కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్యక్రమ నిర్వహణకు మాత్రం ఎలాంటి నిధులు ఇవ్వకుండా కార్యదర్శులు జేబులో నుంచి ఖర్చు పెట్టాలని ఆదేశించింది. చేసేదేమీ లేక స్వతహాగా ఖర్చుచేసి ఐదు రోజుల కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఖర్చును ఇప్పుడు ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీలకు జనాభా ఆధారంగా అందజేస్తుంది. 3వేల వరకు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50,000, 3వేల నుంచి 8వేల వరకు ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.75,000, 8 వేలకు పైగా ఉన్న పంచాయతీలకు రూ.లక్ష చొప్పున కేటాయించింది. ఒకటి రెండు రోజుల్లో ఆయా గ్రామ పంచాయతీల్లోని ఖాతాల్లో ఈమొత్తం జమకాబోతుందని జిల్లా పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు.

కార్మికుల్లో ఆనందం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,688 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 6,995 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. పంచాయతీ ఆదాయన్ని బట్టీ కొంత మందికి 6 నెలల జీతం పెండింగ్‌లో ఉండగా, మరో కొంత మందికి రెండు, మూడు నెలల జీతం పెండింగ్ ఉంది వీరందరికీ కలిపి ప్రసుత్తం ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో నుంచి ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు వేతనాలు అందజేయనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో కొంత కాలంగా వేతనాల కోసం ఎదురుచూస్తున్న హనుమకొండలోని 1006 కార్మికులు, జనగామలో 1,209, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,033, మహబూబాబాద్ జిల్లాలో 1,781, ములుగులో 806, వరంగల్‌లో 1,160 మెత్తం కలిపి 6,995 మంది కార్మికులు దసరా పండుగ ముందు వేతనాలు అందుకోనున్నారు.

సరిపోని నిధులు

ప్రస్తుతం విడుదల చేసిన నిధులతో కొంత ఉపశమనం దొరుకుతుంది కానీ పూర్తిగా పంచాయతీల్లోని నిధుల లేమిని పూడ్చలేదని కార్యదర్శులు తెలుపుతున్నారు. సెంట్రల్, స్టేట్ ఫైనాన్స్ నిధులు ఆపివేయడంతో రోజు వారి కార్యక్రమాల నిర్వహణ ఇబ్బందిగానే మారిందంటున్నారు. జేపీఎస్, ఓపీఎస్ కార్యదర్శుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. సర్పంచ్‌లు వస్తే కానీ కార్యదర్శుల ఇబ్బందులు తొలగవని చాలా మంది కార్యదర్శులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వారిగా విడుదల చేసిన నిధులు (రూ.కోట్లలో)

జిల్లా	జీపీల సంఖ్య	నిధులు
హనుమకొండ	208	2,75,05,217
వరంగల్	323	3,23,44,427
జనగామ	281	3,81,31,080
మహబూబాబాద్	461	5,37,24,129
జయశంకర్ భూపాలపల్లి	241	2,70,26,027
ములుగు	174	2,17,03,374

జీపీ ఖాతాల్లో జమ చేస్తున్నాం..



లక్ష్మీరమాకాంత్, హనుమకొండ జిల్లా డీపీవో

ప్రభుత్వం నిధులు విడుద ల చేసింది. ట్రెజరీ ద్వారా గ్రామ పంచాయతీ ఖాతాల్లో కి నిధులు వెళ్లాయి. గ్రామ పంచాయతీ వాహనాల ఈఎంఐతోపాటు స్వచ్ఛదనం- పచ్చదనం, కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపుకు నిధులను వినియోగించుకోవచ్చు.



భవానీ మాతగా భద్రకాళి

వరంగల్ కల్చరల్, అక్టోబరు 8: వరంగల్‌లోని భద్రకాళి దేవస్థానంలో దేవీ నవరాత్రి వేడుకలు మంగళవారానికి ఆరో రోజుకు చేరాయి. ఉదయం నిత్య పూజల అనంతరం అమ్మవారిని భవానీమాతగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదగిరిగుట్ట దేవస్థానం చైర్మన్ నర్సింహమూర్తి గంధోత్సవాన్ని నిర్వహించి సాలాబంజిక సేవ జరిపారు. ఈవో శేషు భారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రకాళి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. నగర మేయర్ గుండు సుధా రాణి అమ్మవా రిని దర్శించుకొ ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. నేడు మూల నక్షత్రం సంద ర్భంగా అమ్మవా రిని సరస్వతి మాతగా అలం కరిస్తారు.





కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు



వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 8: నిత్యం విధుల్లో బిజీబిజీ ఉండే ఉన్నతాధికారులు బతుకమ్మ వేడుకల్లో ఆడిపాడారు. తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటంతో సందడి చేశారు. పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు బతుకమ్మలతో తరలిరావడంతో మంగళవారం కలెక్టరేట్‌లో సందడి సందడిగా మారింది. కలెక్టర్ సత్యశారద బతుకమ్మను నెత్తిన ఎత్తుకుని ఉద్యోగులతో కలిసి బతుకమ్మ పాటలకు అనుగుణంగా ఆడిపాడారు. టీఎన్‌జీవో, టీజీవో, ట్రెసా, 4వ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. సుమారు 18 శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మలను ఏర్పాటు చేయగా కలెక్టరేట్ సిబ్బంది(ప్రథమ), డీఆర్‌డీఏ(ద్వితీయ), మెప్మా ఉద్యోగులు (తృతీయ) బహుమతులు కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పువ్వులను దేవతలుగా పూజించే గొప్ప పండగ బతుకమ్మ అని అలాంటి గొప్ప పండగను కలెక్టరేట్‌లో ప్రతి సంవత్సరం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని కలెక్టర్ అన్నారు. వేడుకల్లో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షు డు గజ్జెల రాంకిషన్, కార్యదర్శి గాజె వేణుగో పాల్, ఫణి కుమార్, సివిల్ సప్లై డీఎం సంధ్యారాణి, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారులు పుష్పాలతారెడ్డితదితరులు పాల్గొన్నారు.





దీప్తిని అభినందిస్తున్న కలెక్టర్ సత్యశారద

పారా ఒలింపిక్ విజేతను అభినందించిన కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 8: ఇటీవల పారిస్‌లో జరిగినపారా ఒలంపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన పారా అథ్లెట్ దీప్తి జీవంజిని కలెక్టర్ సత్యశారద శారద అభినందించారు. మంగళవా రం కలెక్టరేట్‌లో ద్రోణాచార్య అవార్డుగ్రహీత రమేశ్‌తో కలిసి దీప్తి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒలంపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటారని ప్రశంసించారు. మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ సత్యవాణి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాష్ యాదవ్, కోకో అసోసియేషన్ సెక్రటరీ శ్రీశైలం, క్రికెట్ కోచ్ సుమన్ పాల్గొన్నారు.



డీఈవోపై కలెక్టర్ ఆగ్రహం

- డీఎస్సీ ఎంపిక జాబితాల వెరిఫికేషన్‌లో తీవ్ర జాప్యం
- డీఈవో జ్ఞానేశ్వర్ పనితీరుపై అసహనం

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 8: వరంగల్ డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ పనితీరుపై కలెక్టర్ సత్యశారద ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ-2024 ఎంపిక జాబితాల వెరిఫికేషన్ విషయంలో కాలయాపన చేస్తున్న డీఈవో తీరుపై మంగళవారం రాత్రి మండిపడ్డారు. అన్ని జిల్లాల్లో సాయంత్రానికల్లా అభ్యర్థుల జాబితాల ప్రక్రియ పూర్తి కాగా వరంగల్ జిల్లాలో మాత్రం రాత్రి 9.30గంటలు దాటినా పూర్తి కాలేదు. సమాచారం తెలుసుకున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి డీఈవో కార్యాలయానికి చేరుకున్నారు. డీఈవో పనితీరుపై ఆమె మండిపడుతూ అసహనం వ్యక్తం చేశారు. పని విభజన చేయకుండా మొత్తం పనిని ఇద్దరు, ముగ్గురు వ్యక్తులతోనే చేయిస్తున్న తీరును గుర్తించారు. దీంతో ఆమె ఆమె పనితీరు సరిగా లేదని అసహనం వ్యక్తం చేశారు. పని త్వరగా పూర్తి చేయాలని డీఈవోను ఆదేశిస్తూ ఆమె అక్కడే ఉండి మిగతా సిబ్బందికి పనిని బదలాయించి పూర్తి చేయించారు. మొత్తంగా కలెక్టర్ వస్తే గానీ డీఈవో కార్యాలయంలో డీఎస్సీ-2024లో ఎంపికైన ఉపాధ్యాయుల పని పూర్తికాలేదనే అపవాదును వరంగల్ డీఈవో ఆఫీస్ మూటగట్టుకుంది. ఈ క్రమంలో మెరిట్ జాబితాలో తనకంటే మార్కులు తక్కువగా వచ్చిన అభ్యర్థికి ఉద్యోగం కల్పించారంటూ ఓ అభ్యర్థి అదనపు కలెక్టర్‌కు విన్నివించాడు. కాగా మెరిట్ జాబితాను డీఎస్సీ నుంచి పంపించారని ఏదైనా సమస్య ఉంటే అక్కడ అర్జీ పెట్టుకోవాలని ఆమె సదరు అభ్యర్థికి సూచించినట్లు తెలిసింది.





పేదరికం అడ్డురాలే.. వైకల్యంతో కుంగిపోలే

- పట్టుదల, క్రమశిక్షణతో కాంస్యం సాధించింది
- క్రీడాకారులు దీప్తిని స్ఫూర్తిగా తీసుకోవాలి
- అథ్లెటిక్స్ ఇండియా చీఫ్ కోచ్ నాగపురి రమేష్
- రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల ముగింపు వేడుకల్లో వెల్లడి



విజేతలతో రమేష్, దీప్తి జీవంజి



న్యాయశాస్త్రం సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్, అక్టోబరు 8: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అక్టోబరు 16 నుంచి జరగాల్సిన న్యాయశాస్త్రం సెమిస్టర్ పరీక్షలను గ్రూప్-1 పరీక్షల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన పరీక్షల్లో ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సు రెండో సెమిస్టర్, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు ఆరో సెమిస్టర్ అలాగే ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ పరీక్షలున్నాయని వివరించారు.

సత్తెమ్మ పాట.. రాగాల పూదోట..

కష్టసుఖాల దొంతరలే ఆమె పాటలకు రూపం

ఆకాశవాణిలో ఆలపించిన బతుకమ్మ పాటలు

ఆడియో క్యాసెట్లుగా రూపాంతరం

లింగాలఘణపురం, అక్టోబరు 8:సాహిత్య లోకమెరుగని కళాపిపాసి ఆమె.. ఆమె కైకట్టి పాడే ప్రతీ పాట లక్షల ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. సుస్వరాలు ఎరుగకపోయినా.. అక్షరం ముక్క నేర్వక పోయినా.. బడుగుల కష్టాలను ఒక్కటిగా పోగు చేసినట్లు.. జనజీవన శ్రమైకంలో చిందించే చెమట చుక్కలు రాశులుగా పేర్చినట్లు.. అభాగ్యుల కన్నీటి ధారలను ఒడిసిపట్టి బతుకమ్మ పాట రూపంలో బడుగులకు బతుకు నేర్పుతుంది. జీవితంలో ఎదురయ్యే కష్టం.. సుఖం.. మనోల్లాసానికి ఉపయుక్తమయ్యే ఆటలు.. పాటలు.. ఇలా అన్నీ కలబోసి ఆమె నోట వెలువడే బతుకమ్మ పాట బడుగుల బతుకులకు కొత్త ఊపిరిలూదుతోంది. కనుమరుగవుతున్న సాంస్కృతిక సంరంభాన్ని నాలుగు బాటల వద్ద నిటారుగా నిలబెట్టినట్టు పాడే ఆమె ఉయ్యాల పాట బతుకు భరోసాకు సరికొత్త ఊటగా ఉత్సాహాన్నిస్తుంది. ఆమె కంఠం ఓ ఘంటానాధం.. రాగరంజితాన్ని రంగరించుకున్న ఆమె పాట సెలయేటి ఊటై బడుగుల బతుకులకు భాష్యం నేర్పుతోంది. ఆమే.. లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన కడకంచి సత్తెమ్మ ఉరఫ్ ఉయ్యాల పాటల సత్తెమ్మ. సత్తెమ్మ రాగం పల్లె బతుకుల జీవన గానం.. కనుమరుగవుతున్న సంస్కృతీ సంప్రదాయాలకు పునరుజ్జీవం పోస్తున్న కళాతపస్వి ఆమె. గడిచిన 60 ఏళ్లుగా నవతరానికి బతుకమ్మ పాటలను నేర్పుతూ బతుకు భాష్యానికి నాందిగా.. సంస్కృతీ సాంప్రదాయాలకు దిక్సూచిగా నిలుస్తోంది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయల వైభవం.. బతుకమ్మ వేడుకల సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం. సత్తెమ్మ గళమెత్తిందంటే చాలు ఇంటి ముంగిళ్లలో గుసగుసలాడే అతివలంతా ఆమె దరికి చేరాల్సిందే. అలా వచ్చిన వాళ్లంతా ఆమె పాటకు వంతపాటాడాల్సిందే. అదే సత్తెమ్మ ప్రత్యేకత.

కన్నీటి కష్టాలే.. బతుకమ్మ పాటలుగా..

అక్షరజ్ఞానం అసలే ఎరుగని సత్తెమ్మ తన చుట్టూ నిత్యం ఎదుర్కొంటున్న కష్టాలను.. తోటి వారు ఎదుర్కొంటున్న బాధలను తన జీవితంలో ఎదురైన ఇబ్బందుల సారాన్ని పాటల రూపంలో మలచడం సత్తెమ్మ ప్రత్యేకత. ప్రతీ ఏటా స్వగ్రామం నెల్లుట్లలో మహాలయామావాస్య రోజు జరిగే ఎంగిలి బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ దాకా సత్తెమ్మతో పాటలను పాడించుకునేందుకు స్థానికులు ఉవ్విళ్లూరుతుంటారు.

ఎల్లలు దాటిన.. సత్తెమ్మ పాటలు..

బతుకమ్మ పాటలతో పరిచయమైన సత్తెమ్మ తన పాటల తూటాలను వరంగల్ ఆకాశవాణిలో ఉర్రూతలూగించింది. అంతటితో ఆగకుండా తన పాటల ప్రవాహాన్ని ఒగ్గు కళాసామ్రాట్ చుక్క సత్తయ్య, బుగ్గ మల్లయ్య ప్రోత్సాహంతో ఆడియో రికార్డింగ్‌ను కూడా చేయించారు. ఒంగూరి మల్లేశ్‌యాదవ్ నిర్మాణంలో బతుకమ్మ పాటలతో పాటుగా రేణుకా ఎల్లమ్మ, సమ్మక్క సారలమ్మ, మాంధాత, పార్వతీ, బీరప్ప, పెద్దిరాజు, గంగురాజు, శ్రీదేవి, వన్నెల అక్కమ్మ, మల్లన్న, వేములవాడ రాజన్నకు చెందిన పురాణ కథలను అనర్గలంగా చెబుతూ సత్తెమ్మ తన



ప్రావీణ్యాన్ని వేనోళ్ల చాటుతోంది. సత్తెమ్మ పాడిన ఉయ్యాల పాటలు, బతుకమ్మ పాటలు క్యాసెట్లు, సీడీల రూపంలో తయారై ఎంతో మందికి సాంస్కృతిక సంబరాన్ని పంచిస్తోంది. తెలంగాణ స్వరాష్ట్రంలో బతుకమ్మ పాటలకు విశేష ఆదరణ లభిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తుంది.

20వ ఏట నుంచి పాటల తూటాగా ఎదిగి..

సత్తెమ్మ తన 20వ ఏట నుంచే పాటల తూటగా ఎదిగింది. ప్రస్తుతం 80 ఏళ్ల వయసున్న సత్తెమ్మ గళం ఇప్పటికీ ఓ ఘంటారావమై మారుమ్రోగుతుంది. వయసు మీదపడ్డా తన కంఠంలో పదును ఏమాత్రం తగ్గలేదని, ఏటేటా పాటల సవ్వడిలో నిత్యనూతనమే నంటూ నిరూపిస్తుంది. జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన సత్తెమ్మకు చిన్నతనంలో 10వ ఏటలోనే నెల్లుట్లకు చెందిన కడకంచి బీరయ్యతో బాల్యవివాహం జరిగింది. పెళ్లైన 10 ఏళ్ల తర్వాత తన పాటకు పదును పెట్టి 60 ఏళ్లుగా వెనకకు తిరగకుండా బతుకమ్మ పాటలకు జీవంపోస్తుండటం గమనార్హం.

> అడవుల్లో పుట్టినావా గౌరమ్మా..
> ఆకుల్లో పెరిగినావా గౌరమ్మ..
> నిండు అమాసనాడూ గౌరమ్మా..
> మా ఇంటికొచ్చినావా గౌరమ్మ..
> పూవుల్ల పూజిద్దునా గౌరమ్మా..
> గంధాన కరిగిద్దునా గౌరమ్మ..
> తీగమల్లెలు తెచ్చి.. నాగ మల్లెలు తెచ్చి..
> తీగమల్లెలు తెచ్చి.. నాగ మల్లెలు తెచ్చి..
> నాగమల్లెలు తెద్దునా గౌరమ్మా..
> నిన్నే పూజిద్దునా గౌరమ్మ..
> బ్రాహ్మణులను పిలుపిద్దునా గౌరమ్మా..
> అక్షింతలు వేయిద్దునా గౌరమ్మ..
> అద్దమడుగు నెయ్యి.. ఆవునేతి బొట్టు..
> నేతిలో కరిగిద్దునా గౌరమ్మా..
> మల్లెల్లో పూజిద్దునా గౌరమ్మ..
> ఎన్నెన్నో పూజలు మెప్పుగా జేయించి..
> గొప్పగా జేయిద్దునా గౌరమ్మా..
> గంగలో ఒదిలొద్దునా గౌరమ్మ

డ్యూటీ మీట్ పోటీలతో వృత్తి నైపుణ్యం పెరుగుతుంది..

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, అక్టోబర్ 8: డ్యూటీ మీట్ పోటీల్లో పాల్గొనడం ద్వారా పోలీసు అధికారులు తమ వృత్తిలో మరింత రాణించొచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మూడురోజుల పాటు కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన జోనల్ పోలీసు డ్యూటీ మీట్‌లో విజయం సాధించిన పోలీసు అధికారులకు సీపీ మంగళవారం పతకాలను బహూకరించారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్న జోనల్ స్థాయి డ్యూటీ మీట్ ఈనెల 3వతేదీ నుంచి మూడు రోజుల పాటు వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. అధికారులు రోజువారిగా నిర్వహించే విధులకు సంబంధించి 18 విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి సీపీ చేతుల మీదుగా పతకాలు అందచేశారు. విజేతలు ఈనెలలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. వృత్తిలో నైపుణ్యం సాధించడం ద్వారా నురస్థులను గుర్తించడం సులభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్రతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



విజయం సాధించిన పోలీసులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

అభ్యర్థుల్లేక ఆగిన పోస్టులు 59

నేడు హైదరాబాద్‌కు కొత్త టీచర్ల పయనం

ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 8: డీఎస్సీ-2024 నియామకాల ప్రక్రియ ఎట్టకేలకు ముగియనుంది. ఈ నెల 3 నుంచి 5 వరకు 1:3 ప్రాతిపదికన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించగా, మంగళవారం ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల జాబితాలను సంబంధిత డీఈవోలు వారి కార్యాలయ వెబ్‌సైట్లలో పొందుపరిచారు. అయితే రెండు జిల్లాల్లో 488 పోస్టులు భర్తీ కానున్నాయని ముందుగా ప్రకటించినప్పటికీ సంబంధిత కేటగిరీల్లో అభ్యర్థులు లేకపోవడంతో 59 పోస్టులు మళ్లీ ఖాళీగానే దర్శనమీయనున్నాయి.

వరంగల్ జిల్లాలో 17 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు సంబంధిత క్వాలిఫికేషన్ ఉన్న అభ్యర్థులు లేకపోవడంతో వాటిని ఖాళీలుగానే ఉంచారు. అలాగే వివిధ కేటగిరీల్లో అభ్యర్థులు లేక 21 పోస్టులు బ్యాక్‌లాగ్‌గా మిగిలాయి. కాగా, జిల్లాలో మొత్తం 301 పోస్టులకుగాను 38 పోస్టులు ఖాళీలుగానే మిలిగిపోయాయి. ఇక హనుమకొండ జిల్లాలో స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సంబంధిత క్వాలిఫికేషన్ గల అభ్యర్థులు లేకపోవడంతో 12 పోస్టులు ఖాళీలుగానే మిగలగా, ఎస్జీటీల్లో సంబంధిత కేటగిరీల్లో 6 పోస్టులకు సంబంధిత క్వాలిఫికేషన్ అభ్యర్థులు లేకపోవడంతో అవి బ్యాక్‌లాగ్ పోస్టులుగా మిగిలిపోనున్నాయి. మొత్తంగా జిల్లాలో 187 పోస్టులకు 18 పోస్టులు ఖాళీగానే మిగలనున్నాయి. కాగా, కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకోనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ యంత్రాంగం కొత్తగా ఎంపికైన అభ్యర్థులను బస్సుల్లో హైదరాబాద్ తరలించేందుకు అన్ని చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద నుంచి వారిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

డైట్ బకాయిలు చెల్లించండి

బోధన ఆస్పత్రుల డైట్ కాంట్రాక్టర్ల మొర



వరంగల్ మెడికల్, అక్టోబరు 8: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బోధన ఆస్పత్రులలో డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని డైట్ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల కాలంగా నిధులు విడుదల చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలలకోసారి బిల్లులు మంజూరు చేయాల్సి ఉన్నప్పటికీ ఆరు నెలలకు పైగా గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులకు ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్న తమను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రూ.3 కోట్లు, వరంగల్ సీకేఎం ఆస్పత్రిలో రూ.36లక్షలు, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రూ.33లక్షలు, టీబీ ఆస్పత్రిలో రూ.15లక్షలు, వరంగల్ కంటి ఆస్పత్రిలో రూ.15లక్షల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని డైట్ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వద్ద పనిచేసే ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని, దసరా, దీపావళి పండుగలు ఉన్న నేపథ్యంలో బిల్లులను వెంటనే మంజూరు చేయాలని వారు కోరారు.

నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించిన యువకుడు

పర్వతగిరి, అక్టోబరు 8: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని దౌలత్‌నగర్ గ్రామశివారు బాజుతండాకు చెందిన మాలోత్ సుకుమార్ అనే యువకుడు ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించాడు. బాజుతండాకు చెందిన మాలోత్ శేర్యా- పతాని దంపతులకు ఒక కూతురు రజిత, ఇద్దరు కుమారులు రాము, సుకుమార్ ఉన్నారు. రజితకు వివాహం కాగా, పెద్దకుమారుడు రాము డిగ్రీ పూర్తిచేసి తండాలో తల్లిదండ్రులకు వ్యవసాయంలో చేదోడుగా ఉంటున్నాడు. చిన్నకుమారుడు సుకుమార్ ఎన్ఐటీ వరంగల్‌లో 2021లో ఎంటెక్ పూర్తిచేసి ఉద్యోగప్రయత్నాల్లో భాగంగా పలు పోటీపరీక్షలు రాశాడు. ఏకంగా నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించాడు. స్టాఫ్‌సెలక్షన్ కమిషన్(ఎస్సెస్సీ)లో జూనియర్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పాలిటెక్నిక్ లెక్చరర్, అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులకు ఎంపికయ్యారు. నాలుగు పోస్టులకు అర్హత సాధించగా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈగా ఉద్యోగంలో చేరి సేవలందించడానికి గాను సుకుమార్ సుముఖతను వ్యక్తం చేశారు. తమ కుమారుడు ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించడంతో ఇటు తల్లిదండ్రులతో పాటు అటు తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.



మాలోత్ సుకుమార్

పేదరికం అడ్డురాలే.. వైకల్యంతో కుంగిపోలే..

క్రీడాకారులు దీప్తిని స్ఫూర్తిగా తీసుకోవాలి

అథ్లెటిక్స్ ఇండియా చీఫ్ కోచ్ నాగపురి రమేష్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల ముగింపు వేడుకల్లో వెల్లడి

వరంగల్ స్పోర్ట్స్ అక్టోబరు 8: చాలామంది తమలో ఉన్న చిన్న చిన్న లోపాలకే కుంగిపోతూ వైకల్యం ఉంటే ఏదీ సాధించలేమనే భావనతో ఉన్నవారికి జీవంజి దీప్తి స్ఫూర్తిగా నిలిచారని అథ్లెటిక్స్ ఇండియా చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ కొనియాడారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎన్ఎస్‌లోని సింథటిక్ ట్రాక్‌పై రెండు రోజులుగా నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇతర అమ్మాయిలా మాదిరిగా కాకుండా కొంత భిన్నంగా ఉండడంతో పలువురు దీప్తిని హేళన చేయడంతో ఆమె కుంగిపోకుండా మొక్కవోని దీక్షతో పారాలింపిక్స్‌లో పాల్గొని కాంస్య పతకం సాధించడంతో నేడు తనతో ఫొటోలు దిగేందుకు ఉత్సాహాన్ని కనబరుస్తున్నారన్నారు. ఇటీవల నిర్వహించిన పారాలింపిక్స్‌లో కల్లెడకు చెందిన జీవంజి దీప్తికి తెలుగురాష్ట్రాల్లో కాంస్య పతకం సాధించిన ఘనత దక్కిందన్నారు. తన దగ్గర అథ్లెటిక్స్‌లో తర్ఫీదు పొందుతూ ఒలంపిక్స్‌లో దీప్తి కాంస్య పతకం సాధించడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. పారాలింపిక్స్ కాంస్య పతక విజేత జీవంజి దీప్తి మాట్లాడుతూ.. ఒలంపిక్స్‌లో పతకం సాధించడం కోసం ఆహర్నిషలు కష్టపడుతూ కోచ్ నాగపురి రమేష్ సలహాలు సూచనలతో కాంస్య పతకం సాధించానన్నారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. అండర్ -14, 16, 18, 20 బాల బాలికల విభాగాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో సుమారు 1,100 మంది క్రీడాకారులు, 100 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారన్నారు. 100, 400, 600, 3000, 10,000 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్, ట్రిబుల్ జంప్, హైజంప్, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రో, డిస్కస్‌త్రో, స్టీపుల్‌చేజ్, 110 మీటర్ల హార్డిల్స్, 4ఇంటు 400 మిడ్ రిలే, ట్రయాత్లేన్, పోల్‌వాల్ట్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీవైఎస్‌వో జి.అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గట్టు మహేష్‌గౌడ్‌బాబు, ములుగు జిల్లా అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్, నారాయణపేట జిల్లాల కార్యదర్శులు రాజాగౌడ్, రమణ, పీడీలు రజినీకాంత్, మనోజ్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, దిమ్మిక నాగరాజు, టెక్నికల్ అఫిషియల్స్ తదితరులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో విజేతగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేస్తున్న హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హోరాహోరీగా పోరు

అథ్లెటిక్స్ ఫైనల్ ఈవెంట్లు హోరాహోరీగా జరిగాయి. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా తమ సత్తా చాటుకున్నారు. 100 మీటరు, 3000 మీటర్లు, హార్డిల్స్, స్టీపుల్ చేజ్ పోటీల్లో ఒకరికి మించి ఒకరు గెలవాలని సంకల్పంతో ఎండ వేడిమిని లెక్కచేయకుండా అనుకున్న లక్ష్యంవైపు పరుగులు తీశారు. రెండో రోజు నిర్వహించిన ఫైనల్స్ అండర్-18 బాలుర 100మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం గణేష్ (నల్లగొండ), ద్వితీయ స్థానం ఎస్.హర్షవర్ధన్ (రంగారెడ్డి), తృతీయ స్థానం కె.అశోక్ (ఖమ్మం) సాధించారు. బాలికల విభాగంలో ప్రథమ స్థానం షేక్ సుహాని (హైదరాబాద్), ద్వితీయ స్థానం ఎం.అక్షిత (రంగారెడ్డి), తృతీయ స్థానం అమ్మ అంజుం (మంచిర్యాల) సాధించారు. అండర్- 20 బాలికల 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం ఎన్.ప్రవళిక(నల్లగొండ), ద్వితీయ స్థానం రాగవర్శిని(హైదరాబాద్), తృతీయ స్థానం ఎం.శృతి(నాగర్‌కర్నూల్) పొందారు. అండర్-20 బాలుర జావెలిన్‌త్రోలో ప్రథమ స్థానం కె.స్వామి, ద్వితీయ స్థానం పి.నగేష్, తృతీయ స్థానం ఆర్.తరుణ్‌కుమార్ సాధించారు.



అండర్20 బాలుర పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు





బల్దియా సిబ్బందికి చీరలను పంపిణీ చేస్తున్న కుమారస్వామి

బల్దియా సిబ్బందికి చీరల పంపిణీ

ఖిలావరంగల్, అక్టోబరు 8: శివనగర్ ప్రాంతానికి చెందిన బల్దియా సిబ్బందికి కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి మంగళవారం చీరెలు, బట్టలను పంపిణీ చేశారు. శివనగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయం వద్ద సద్దుల బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా నగరపాలక సంస్థ, నీటి సరఫరా, మలేరియా, విద్యుత్ తదితర శాఖల సిబ్బంది, 56 మంది మహిళలకు చీరెలు, పురుషులకు దుస్తులను కార్పొరేటర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, జవాన్ కుమారస్వామి, బీ అంజయ్య పాల్గొన్నారు.



ఔట్ సోర్సింగ్ జేఏసీ కమిటీ లెటర్ ప్యాడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని

మునిసిపల్ ఔట్ సోర్సింగ్ జేఏసీ ఏర్పాటు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 8: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ జేఏసీ ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఎన్నికలు జరిగిన తర్వాత పూర్తి కమిటీని వెల్లడించారు. గౌరవ అధ్యక్షుడిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అధ్యక్షుడిగా కొత్తకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వక్కల రాణాసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సుద్దాల కుమార్, నేరెళ్ల కుమార్, పిండి రవి, రంగు యుగేందర్, సోంపెల్లి సురేందర్, కోశాధికారులుగా ఎర్ర రాము, ఎర్ర అరుణ్, ఉపాధ్యక్షులుగా కుమ్మరి అశోక్, ఏల్పుగొండ చిరంజీవి, బొక్క రాజేశ్, వరలక్ష్మి, దామెర రాజు, అవినాష్‌లు ఎన్నిక కాగా, కార్యదర్శులుగా కొమ్ము తిలక్, ఇంద్రసేన, ఎర్ర ప్రదీప్, యాజిన్, రమేష్, ఐలయ్య, అరుణ్, సుభద్రలు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చారి, సాంబరాజు, శేఖర్, గోపి, పవన్, సంధ్య, కుమార్, రాజును ఎన్నుకున్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌ను కలిసి పారి శుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు విన్నవించారు.

బండి సంజయ్‌ని కలిసిన నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో బీజేపీ శ్రేణులు

పోచమ్మమైదాన్, అక్టోబరు 8: కేంద్ర హోం సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ని మంగళవారం వరంగల్ నగరానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు కలిశారు. వరంగల్ బీజేపీ కార్యదర్శి గోకె వెంకటేష్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి, అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గోడిశాల సూరజ్‌గౌడ్, నాయకులు రమేష్, రాజు, సోను, ఉత్తమ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి మాతగా అలంకరణ

శంభునిపేట, అక్టోబరు 8: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శాకంబరి మాత, కుంకుమార్చన, అన్నదానాలు మంగళవారం నిర్వహించారు. రంగశాయిపేటలో శ్రీ వీరాంజనేయ యూత్ అసోసియేషన్ రంగశాయిపేటలో అమ్మవారిని సోమవారం రాత్రి శాకంబరి మాతగా అలంకరించారు. కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగశాయిపేటలోని శివపుత్ర యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.



శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

మెరిసేదంతా బంగారం కాదు

▸▸ బంగారం క్రయ విక్రయాల్లో ఏమరపాటు తగదు ▸▸ యంత్రాలతో నాణ్యతను తెలుసుకోవచ్చు



వరంగల్ సిటీ, అక్టోబరు 8 : మెరిసేదంతా బంగారం కాదన్నారో మహాకవి. నిజమే ఈ మధ్య జరుగుతున్న మోసాలను చూస్తే ఇది నిజమే అనిపిస్తుంది. తాకట్టు పెట్టేప్పుడు నాసిరకం బంగారాన్ని ఇ స్తూ మోసగిస్తున్నారు. బంగారం స్వచ్ఛతను తెలుసుకోకుండా కొంటే పప్పులో కాలేసినట్లే.. ఏదీ మేలిమి బంగారమో.. ఏదీ నకిలీ బంగా రమో కచ్చితంగా తెలుసుకోవాలి.

కేవలం బిస్కెట్ రూపంలో దొరికే బంగారమే వంద శాతం మేలిమి బంగారం. ఇది మెత్తగా ఉం టుంది. మేలిమి బంగారంతో ఏ విధమైన బంగారు వస్తువులు తయారు చేయడం వీలుకాదు. వస్తువులు తయారు చేయాలంటే వంద గ్రాముల బంగారంలో ఎనిమిదిన్నర గ్రాముల రాగి కలు పాల్సిందే. అప్పుడే బంగారు వస్తువులు తయారు చేయవచ్చు.

మోసం ఇలా..

కొన్ని బ్యాంకుల్లో బంగారం నాణ్యతను నిర్ధారించే ఉద్యోగులు ఇష్టానుసారంగా పరీక్షిస్తున్నారు. కొన్ని ప్రైవేటు సంస్థలు ఏ మాత్రం అనుభవంలేని వారికి వివిధ రకాల శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాయి. వాటితో బ్యాంకుల్లో ఉద్యోగాలు దొరుకుతున్నాయి. దీనివల్ల వినియోగదారులు తాకట్టు పెట్టుకునే బంగారం నిజమైనదా ? కాదా ? నిర్ధారణ చేయడం కష్టమవుతుంది.

గీటురాయితో ఇలా తెలుసుకోవాలి

స్వచ్ఛమైన బంగారం నాణ్యతను గీటురాయి ద్వారా తెలుసుకోవచ్చు. బంగారాన్ని గీటురాయిపై రుద్దిన తర్వాత యాసిడ్‌లో వేయడంతో గీటురాయిపై బంగారం గీతల మెరుపు తగ్గదు. అదే నకిలీదైతే బంగారం గీతలు యాసిడ్ ద్రావకం వేసిన వెంటనే పోతాయి.

కట్టు బంగారంతో జాగ్రత్త

కట్టు బంగారంతో చేసిన వస్తువులను కనిపెట్టడం చాలా కష్టం. కట్టు బంగారంలో ఆరు గ్రాముల బంగారంతో తయారు చేసిన వస్తువులపై పూతలా వేస్తారు. లోపల రాగి ఉంటుంది. వీటిని బంగారం టెస్టింగ్ యంత్రాలు కూడా కనిపెట్టలేవు. దీన్ని కేవలం స్వర్ణ వృత్తిలో కొనసాగుతూ అనుభవం ఉన్న స్వర్ణకారులు మాత్రమే గుర్తించగలుగుతారు. బంగారం బరువును బట్టి బంగారం నాణ్యతను చెప్పవచ్చు.

యంత్రాలతో బంగారం నాణ్యత

యంత్రాల ద్వారా బంగారం స్వచ్ఛతను తెలుసుకోవచ్చు. వీలు కాకపోతే ఆ వస్తువులను కుంపటి కొలిమిలో కాల్చి, తర్వాత వస్తువును యాసిడ్‌లో వేయడం వల్ల బంగారు వస్తువు నాణ్యతను తెలుసుకోవచ్చు.

రంగుతో గుర్తు పట్టవచ్చు

24 క్యారెట్ల మేలిమి బంగారం చూడడానికి ముదురు పసుపు రంగులో ఉంటుంది. ఇది మెత్తగా ఉంటుంది. దీంతో వస్తువులు తయారు చేయడం కుదరదు. ఒకవేల చేసినా.. వస్తువులు సులువుగా వంగి పోతాయి. 91.6 కేడీఎం బంగారం చూడడానికి లేత పసుపు రంగులో ఉంటుంది. దీంతో మనకు కావాల్సిన బంగారు వస్తువులను తయారు చేసుకోవచ్చు. ఈ బంగారం కొద్దిగా గట్టిగా ఉంటుంది. 100 గ్రాముల మేలిమి బంగారంలో ఎనిమిదిన్నర గ్రాములు రాగి కలుపడం వల్ల 91.6 కేడీఎం బంగారం అవుతుంది. 916 కంటే తక్కువగా ఉన్న బంగారంలో రాగి ఎక్కువ శాతం కలుస్తుంది. ఈ బంగారంతో చేసిన వస్తువులు కొంత కాలానికి ఎర్రగా మారుతాయి.

విధులకు ఆటంకంపై ఫిర్యాదు

▸▸ ఇండ్లు కూల్చివేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడి ప్రచారం

▸▸ తహసీల్దార్‌పై దాడికి యత్నం.. రాజశేఖర్‌పై కేసు నమోదు



అధికారులను అడ్డుకుంటున్న రాజశేఖర్, స్థానికులు

వరంగల్ సిటీ, అక్టోబరు 8: ఎస్ఆర్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కేతిరి రాజశేఖర్‌పై ప్రభుత్వ అధికారులను అడ్డుకుని, విధులకు ఆటంకం కలిగించారని వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఎక్బాల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఈ పిర్యాదు మేరకు వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... రెండు రోజుల క్రితం 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌కు చెందిన యువకులు, మహిళలు వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజును కలిశారు. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలు జరుపుకునేలా ఎస్ఆర్‌నగర్‌లోని గుడి వద్ద ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించి, చదును చేయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వరంగల్ తహసీల్దార్ ఎక్బాల్‌ను ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

తహసీల్దార్ మంగళవారం సిబ్బందితో కలిసి స్థల పరిశీలనకు ఎస్ఆర్‌నగర్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న కేతిరి రాజశేఖర్ తన కుటుంబ సభ్యులు, ఇండ్లు కూల్చివేసేందుకు అధికారులు వస్తున్నారని అసత్య ప్రచారం చేసి స్థానికులను రెచ్చగొట్టారు. ఈ ఈమేరకు స్థానికులతో కలిసి రాజశేఖర్ తహసీల్దార్, సిబ్బందిని స్థల పరిశీలనకు వెళ్లకుండా అడ్డుకుని దాడికి యత్నించారు. దాంతో తహసీల్దార్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో రాజశేఖర్‌పై ఫిర్యాదు చేశారు. సీఐ రాఘవేందర్ కేసు నమోదు చేశారు.

తహసీల్దార్‌పై దాడికి యత్నించినవారిపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఎక్బాల్‌పై దాడికి యత్నించిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, దాడి ఖండిస్తున్నట్లు తెలంగాణ తహసీల్దార్ల సంఘం(టీజీటీఏ) ప్రకటించింది. టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి పాక రమేష్, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్ఆర్‌నగర్‌లో బతుకమ్మ పండుగ మైదానాన్ని సందర్శిస్తుండగా కొంతమంది స్థానిక నాయకులు ప్రజలను ప్రేరేపించి తప్పుదారి పట్టించి దాడికి యత్నించారని పేర్కొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి : మేయర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 8: గ్రేటర్ వరంగల్ పరిధిలో నిపలు ప్రాంతాల్లో జరిగే సద్దు ల బతుకమ్మ, దసరా పండగలు జరుపుకునేందుకు బల్దియా అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు వరం గల్ మేయర్ గుండు సుధారాణి తెలిపారు. వడ్డేపల్లి, భద్రకాళి చెరువుల వద్ద ఏర్పాట్లను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. వరంగల్ నగరంలోని ఉర్సు రంగసముద్రం, హనుమకొండ వడ్డేపల్లి చెరువు, శివనగర్ బతుకమ్మ కుంట, చిన్నవడ్డేపల్లి చెరువు, మెట్టు దర్వాజ, రంగణేశ్‌నగర్ మంగళమ్మకుంట, మామునూరు పెద్ద చెరువు, రంగశాయిపేట బెస్తం చెరువు, దురుషకుంట ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మకు అన్ని ఏర్పాటు చేశామన్నారు.

చెరువులలో ఉన్న గుర్రపుడెక్కను తొలగించి మైదానాలను శుభ్రం చేశామన్నారు. గుంతలలో డస్ట్ చల్లిం చామని చెప్పారు. ఈ ప్రాంతాలలో ఉన్న బతుకమ్మ విగ్రహాలకు పెయింటింగ్ వేయించామన్నారు. ఇంకా మిగిలి ఉన్న పద్మనగర్, శాంతినగర్‌లలో పనులు జరుగుతున్నాయన్నారు. రావణవధ కార్యక్రమాలకు లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేషన్ దేవరకొండ విజయలక్ష్మి, బల్ది యా ఎస్ఈ రాజయ్య, ఈఈ మహేందర్, డీఈ సారంగంతోపాటు అధికారులు పాల్గొన్నారు.



భద్రకాళి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సుధారాణి

వరంగల్ ఏసీపీపై వేటు ?

▸▸ రంగం సిద్ధం చేసిన ఉన్నతాధికారులు ▸▸ ఇప్పటికే ఇద్దరు సీఐలపై వేటు ▸▸ ప్రైవేటు వ్యక్తులకు సేవల ఫలితం

వరంగల్ క్రైం, అక్టోబరు 8: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ డివిజన్ ఏసీపీ నందిరాంనాయక్‌పై బదిలీ వేటు పడనున్నట్లు అధికారిక సమాచారం. ఒకటిరెండు రోజుల్లో ఆయనపై వేటు వేసి కొత్త ఏసీపీని నియమించేలా చర్యలు ప్రారంభమైనట్లు తెలిసింది. ఇప్పటికే వరంగల్ డివిజన్‌లోని ఇద్దరు సీఐలపై బదిలీ వేటుపడగా, ఏసీపీపై కూడా బదిలీ వేటు పడనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

నేతల సేవల ఫలితం

వరంగల్ పోలీసు డివిజన్ పరిధిలోని ఏసీపీతో పాటు ఇద్దరు సీఐలు ప్రైవేటు వ్యక్తుల పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడం, దైవ దర్శనాలకు ఎస్కార్ట్‌గా వెళ్లడం వివాదాస్పదమైంది. ఈ విషయమై సీపీ అంబర్ కిషోర్ ఝా విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ సీఐలు మల్లయ్య, శివకుమార్‌లపై వేటు పడింది. ఇద్దరిపై బదిలీ వేటు వేసి ఏసీపీని మినహాయించారనే ప్రచారం జరిగింది. ప్రైవేటు వ్యక్తులు ఏసీపీ బదిలీ కాకుండా కాపాడుతున్నారనే వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏసీపీపై బదిలీ వేటు వేయాలని శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఒకటి రెండురోజుల్లో ఏసీపీపై బదిలీ వేటుపడే అవకాశం ఉన్నట్లు అధికారిక సమాచారం. కాగా కొత్త ఏసీపీ నియామకం సైతం జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మొత్తంగా వరంగల్ డివిజన్ పోలీసు అధికారులు ప్రైవేటు వ్యక్తులకు అధికారిక సేవలు అందించి క్రమ శిక్షణా చర్యలకు గురికావడం చర్చనీయాంశంగా మారింది.

సీపీకి తలనొప్పి

కమిషనరేట్ పరిధిలోని పలువురు పోలీసు అధికారుల తీరు సీపీ అంబర్ కిషోర్ ఝాకు తలనొప్పిగా మారింది. పలువురు పోలీసు అధికారుల దందాలు, పోస్టింగ్‌ల కోసం ప్రైవేటు వ్యక్తులకు సేవలు చేయడం, ఇతరత్రా విషయాలు ఎక్కువ కావడం ఇబ్బందికరంగా మారినట్లు తెలిసింది. ఈ విషయాలను కట్టడి చేయడం సీపీ వల్ల కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధుల జపం చేస్తున్న పోలీసు అధికారులు సీపీ ఆదేశాలు సైతం లెక్క చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజువారిగా సమీక్షలు జరుపుతూ ప్రక్షాళన చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోందనే విమర్శలున్నాయి. దందాలు చేసే పోలీసుల వైఖరి విషయంలో ప్రజాప్రతినిధులు సైతం సీపీపై గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. ప్రైవేటు వ్యక్తికి గన్‌మెన్‌లు ఇవ్వడం, అతడికి పోలీసులు సేవలు చేయడంపై అధికార పార్టీ ఎమ్మెల్యే ఒకరు సీపీపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కమిషనరేట్ పరిధిలో ప్రధానంగా వరంగల్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారుల తీరుపై సీఎం పేషీ నుంచి ఆరా తీసినట్లు తెలిసింది. మొత్తంగా కమిషనరేట్ పరిధిలోని కొంతమంది అధికారుల తీరు శాఖకు మచ్చ తేవడంతో పాటు సీపీకి తలనొప్పిగా మారడం గమనార్హం.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

సీఎం కప్ టార్చ్ రిలేను జయప్రదం చేయాలి

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 8: ఈనెల 16న వరంగల్ నగరంలో నిర్వహించే సీఎం కప్ టార్చ్ రిలే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టార్చ్‌రిలేలో అధికారులు నిర్వర్తించాల్సిన పనులు, చేపట్టాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. డిస్ట్రిక్ట్ ఒలంపిక్ అసోసియేషన్, ఇతర స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ప్రతినిధులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డీసీపీ రవీందర్, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీవైఎస్‌ఓ సత్యవాణి, బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలతారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి భాగ్యలక్ష్మి, క్రీడా సంఘాల ప్రతినిధులు వరద రాజేశ్వర్‌రావు, కైలాష్ యాదవ్, వెంకన్న, రఘువీర్, సారంగపాణి, శ్యామ్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, తదితరులు

శంభునిపేట, అక్టోబరు 8: బూత్‌స్థాయి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. మంగళవారం రంగశాయిపేటలో బీజేపీ సభ్యత్వ నమోదు రివ్యూ కార్యక్రమంలో ప్రదీప్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పార్టీసభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తాళ్లపెల్లి అర్జున్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు మోహనాచారి, కర్నె రవీందర్, నాయకులు బక్కి రంజిత్, అరె కార్తీక్, కర్నె వాసుదేవ్, దారబోయిన అనిల్, రంజిత్, రాజేంద్ర, బోయిని రాజు, దుబ్యాల అశోక్, మహిళా నాయకురాలు కత్తి సోని, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాల రోడ్డు మరమ్మతు



రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న నాయకులు

వరంగల్‌సిటీ, అక్టోబరు 8: వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాల మేరకు మంగళవారం ఏనుమాముల ఎన్టీఆర్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్‌లు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించే రోడ్డును ప్రొక్లెయినర్‌తో మరమ్మతు చేయిం చా రు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఏ మహేష్, ఈర్ల రాజేందర్, కొత్తపల్లి యాదగిరి, పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హక్కుల సాధనకు కలిసిరావాలి

రాంనగర్, అక్టోబరు 8: బీసీ హక్కుల సాధనకు అధ్యాపకులు కలిసిరావాలని బీసీ జేఏసీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని మాస్టర్జీ కళాశాలలో అధ్యాపకుడు వేణుమాధవ్ అధ్యక్షతన బీసీ అధ్యాపకులు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు రోల్‌మాడల్‌గా ఉంటున్న అధ్యాపకులకు అడుగడుగునా అన్యాయం జరుగుతోందన్నారు. బీసీలు ఐక్యంగా ఉంటే హక్కుల సాధన సులభం అవుతుందన్నారు. దీని కోసం బీసీ జేఏసీని ఏర్పాటు చేసి ప్రతీ సంఘాన్ని ఇందులో భాగస్వామ్యంగా చేసే దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. త్వరలో బీసీ లెక్చరర్స్ ఫోరం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. బీసీల హక్కుల సాధనకు అవగాహన కార్యక్రమాలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రొ.విజయబాబు, పులి శ్రీనివాస్ గౌడ్, తిరునహరి శేషు, గడ్డం బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ వెంకటరత్నం



కరీమాబాద్, అక్టోబరు 8: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా జె. వెంటరత్నం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్స్‌కాలనీ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరించారు. ప్రజల రక్షణ కోసం పోలీసు వ్యవస్థ నిరంతరం విధి నిర్వహణలో ఉంటుందన్నారు. నేరాలకు సంబంధించి ఎలాంటి సంఘటనైనా ప్రజలు పోలీసులకు తెలియపరిచి నేరాల అదుపునకు సహకరించాలని కోరారు.

రాజకీయ ప్రముఖులను కలిసిన ఉత్సవ కమిటీ

కరీమాబాద్, అక్టోబరు 8: దసరా ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం పలువురు రాజకీయ ప్రముఖులను కలిసి దసరా ఉత్సవాలకు హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరుతూ ఆహ్వానం పలికారు. కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు ఆధ్వర్యంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను కలిసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కావ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బతుకమ్మ పండుగ అతిపెద్ద పండుగని, మహిళలు భక్తి ప్రపత్తులతో 9 రోజుల పాటు బతుకమ్మను కొలిచి, ఆట, పాటలతో సద్దుల బతుకమ్మ రోజన నిమజ్జనం చేస్తారని అన్నారు. ఈ వేడుకలకు ప్రభుత్వ పరంగా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ దసరా ఉత్సవాలు దేశంలోనే అత్యంత వైభవంగా ఈ ప్రాంతంలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండా వెంకన్నగౌడ్, సహాయ కోశాధికారి వెలిదే శివమూర్తి, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, ఉపాధ్యక్షుడు గోనే రాంప్రసాద్, నాగపూరి రంజిత్ గౌడ్, పోగాకు సందీప్, దామెరకొండ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు బజ్జూరి వాసు, పూదరి అజయ్, బత్తిని అఖిల్‌గౌడ్, నాగపూరి అశోక్, మహేష్, అంబేద్కర్, కార్యవర్గ సభ్యులు చిరంజీవి, రమేష్, రవిచందర్, రాజు, వినయ్, సతీష్, రాజశేఖర్, రంజిత్, మనోహర్, వంశీ, నాగరాజు, బాలసాయి, జయమహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ కడియం కావ్యను కలిసిన ఉత్సవ కమిటీ సభ్యులు



సీఎం కప్ టార్చ్ రిలేను జయప్రదం చేయాలి

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 8: ఈనెల 16న వరంగల్ నగరంలో నిర్వహించే సీఎం కప్ టార్చ్ రిలే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యా రాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టార్చ్‌రిలేలో అధికారులు నిర్వర్తించాల్సిన పనులు, చేపట్టాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. డిస్ట్రిక్ట్ ఒలంపిక్ అసోసియేషన్, ఇతర స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ప్రతినిధులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డీసీపీ రవీందర్, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీవైఎస్ఓ సత్య వాణి, బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలతారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి భాగ్యలక్ష్మి, క్రీడా సంఘాల ప్రతినిధులు వరద రాజేశ్వర్‌రావు, కైలాష్ యాదవ్, వెంకన్న, రఘువీర్, సారంగపాణి, శ్యామ్ పాల్గొన్నారు.

నాగేంద్రుడిని దర్శించుకున్న రేవూరి దంపతులు


స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న రేవూరి దంపతులు

గీసుగొండ, అక్టోబరు 8: ఊకల్ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి-సునంద దంపతులు మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల టీటీడీచే గౌరవ డాక్టరేట్‌ను పొందిన ప్రధానార్చకుడు సుదర్శనాచార్యులును ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీహర్ష, పీసీసీ ప్రధాన కార్యదర్శి భీమాగాని సౌజన్య, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ జావీద్, ప్రధాన కార్యదర్శి కూసం రమేష్, మాజీ ఎంపీటీసీ వీరారావు, సాయిలి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి: ఎఫ్‌ఆర్వో


సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఫారెస్ట్ అధికారులు

ఖానాపురం, అక్టోబరు 8: పర్యావరణాన్ని పరిరక్షించి జీవవైవిధ్యాన్ని కాపాడాలని ఎఫ్‌ఆర్వో రవికిరణ్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం పాకాలలో అటవీశాఖ అధికారులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవులను, వన్యప్రాణులను సంరక్షించుకొని పర్యావరణాన్ని సంరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. వన్యప్రాణులను వేటాడినా, వాటికి హానికలిగించినా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో రీణా, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న బట్టు సాంబయ్య

నల్లబెల్లి, అక్టోబరు 8 : తెలంగాణ మలిదశ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుడు బట్టు సాంబయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సాంబయ్య మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు ప్రభుత్వ ఉద్యోగం, 250 గజాల ఇంటి స్థలం, రూ.25వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించారు. కావునా ఉద్యమకారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు బొట్ల పవన్, పరికి నవీన్, కొయ్యాడ కుమారస్వామి, కొత్తగట్టు ప్రభాకర్, సామల దేవేందర్ బోయిని శ్రీనివాస్, ఓదెల రవి, పల్లకొండ రవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయపర్తి, అక్టోబరు 8 : మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్ నానమ్మ అయిన నర్సమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు మల్లయ్య, నర్సయ్య, ఎల్లారెడ్డి తదితరులు మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి అండగా ఉంటారని రవీందర్‌రెడ్డి హామీ ఇచ్చారు.

ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 8: మండలంలోని ఉప్పరపెల్లి, ఇల్లంద గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో నిత్య పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకరాలతో భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉప్పరపెల్లిలో అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


ఉప్పరపెల్లిలో శ్రీ మహాలక్ష్మి అవతారంలో దర్శనమిస్తున్న దుర్గామాత

భవాని మాతా అవతారంలో..

చెన్నారావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో దేవి శరన్నరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరో రోజు అమ్మవారిని భవాని మాతా అవతారంలో అలంకరణ చేశారు. మండల కేంద్రంలోని సిద్దేశ్వరాలయం, ఎల్లాయిగూడెంలోని మాధవనగర్ కాలనీతో పాటు పలు వీధులల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు భిక్షమయ్యశాస్త్రి, సాయిశాస్త్రి, బెజ్జింకి ఝాన్సీ బోనాల ప్రియాంక, శ్రీకాంత్, మనోజ్‌కుమార్, నల్ల రాజేష్, గణేష్ పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మి అవతారంలో ..

నల్లబెల్లి: శ్రీవాగ్దేవి యువజన కళా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హనుమాన్ దేవస్థానం ప్రాంతంలో గల వాగ్దేవి కళా వేదికపై మంగళవారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శ్రీ మహాలక్ష్మి అవతారంలో అలంకరించారు. పురోహితులు కడవెండి గణేష్ శర్మ వేద మంత్రాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పూజా కార్యక్రమంలో మాచర్ల లత- రమేష్, కడియాల కల్యాణి- ప్రవీణ్ కుమార్ దంపతులు, భక్తులు గండాల శ్రీశైలం, శ్రీలత, అలేఖ్య, రమేష్, శ్రీనివాస్‌గౌడ్, హరీష్, కళా సంస్థ గౌరవ అధ్యక్షులు రఘుశాల ప్రదీప్, ప్రధాన కార్యదర్శి ఉడత నవీన్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవీ అవతారంలో..

దుగ్గొండి: మండలంలోని తిమ్మంపేట శ్రీలక్ష్మీనర్సింహా స్వామి దేవాలయంలో నెలకొల్పిన దుర్గామాత విగ్రహాన్ని మంగళవారం లక్ష్మీదేవీ అవతారంలో అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాచినపల్లి రామాలయంలో, దుగ్గొండి మండల కేంద్రంలో, మల్లంపల్లి, బంధంపల్లిలో నెలకొల్పిన దుర్గామాత విగ్రహాలను ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి రాము, భక్తులు పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మిదేవి రూపంలో..

నెక్కొండ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో త్రిపుర రూపిణీగా పూజలందుకుంటున్న దుర్గమాత మంగళవారం శ్రీ మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు బీవీఎన్ శాస్త్రి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు న్యాయవాది కొమ్ము రమేశ్, సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, వీరభద్రం, విగ్రహదాతలు మార్త రాజురజిత తదితరులు పాల్గొన్నారు.

బంజారాలను ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలి

తెలంగాణలో ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పాటు చేయాలి

బీజేపీ నేత మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్

నర్సంపేట, అక్టోబరు 8 : బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలను గుర్తించి మహారాష్ట్రలోని పౌరాగ్‌లో నగారా పేరుతో మ్యూజియం, నగారాభవన్‌ను రూ.900 కోట్లతో నిర్మించేందుకు ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించడాన్ని హర్షిస్తున్నట్లు మాజీ ఎంపీ, బీజేపీ నేత అజ్మీరా సీతారాం నాయక్ తెలిపారు. ఈమేరకు ఆయన మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రధాని మోదీ నిర్ణయాన్ని హర్షిస్తూ నేడు(బుధవారం) నర్సంపేటలో వరంగల్ రోడ్డులో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దేశంలోని బంజారాలను ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చి అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. బంజారాల ఇతిహాసాన్ని వెలికి తీసి బంజారాల ఉనికిని ప్రపంచానికి చాటిన గొప్పతనం ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. గత పాలకులు బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను, వారి సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. తెలంగాణలో ఉన్న 40లక్షల మంది బంజారాల కోసం ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతివేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, హతిరామ్ ట్రస్టును ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయమై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కూడా త్వరలో కలువనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలోని అన్నిరాష్ట్రాలోని బంజారాలను గిరిజనులుగా గుర్తించి న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగులరాణాప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్, రేసుశ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, రాంచంద్రారెడ్డి బీజేపీమోర్చా అధికారప్రతినిధి ఆంజనేయులు, గూడూరు సందీప్, కొంకీస విఘ్నేష్‌గౌడ్, ఎస్టీమోర్చా అధ్యక్షుడు బానోతు వీరన్న, ఓబీసీ మోర్చా ప్రధానకార్యదర్శి పంజాల రాము, అచ్చదయాకర్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అజ్మీరా సీతారాంనాయక్

దంపతులు.. టీచర్ కొలువు కొట్టారు..


టీచర్ ఉద్యోగం పొందిన రంజిత్, రోజా

చెన్నారావుపేట, అక్టోబరు 8: వరంగల్ జిల్లా మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన దంపతులు డీఎస్సీలో టీచర్ ఉద్యోగాలు పొందారు. గ్రామానికి చెందిన దంపతులు రాయరాకుల రోజా, రంజిత్ 2024లో డీఎస్సీ రాశారు. డీఎస్సీ ఫలితాల్లో రంజిత్ ఎస్ఏ తెలుగు విభాగంలో 14వ ర్యాంక్ సాధించి వరంగల్ జిల్లాలో ఉద్యోగం పొందగా, రోజా ఎస్ఏ సోషల్‌లో 70వ ర్యాంక్ సాధించి ఎస్ఏ సోషల్ టీచర్‌గా మహబూబాబాద్‌లో టీచర్ ఉద్యోగం సాధించారు. దీంతో గ్రామస్థులు, స్నేహితులు వారిని అభినందించారు.

మునిసిపాలిటీలో మాధన్నపేటను విలీనం చేయొద్దు

ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు కొత్తకొండ రాజమౌళి

నర్సంపేట, అక్టోబరు 8: నర్సంపేట మునిసిపాలిటీలో మండలంలోని మాధన్నపేటను విలీనం చేయవద్దని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు, నర్సంపేట మండల కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలినం వల్ల గ్రామాలు అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. విలీనం వల్ల రియలెస్టేట్ వ్యాపారం పెరిగి వ్యవసాయం రంగం నిర్వీర్యమవుతుందన్నారు. గతంలో మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజాభిప్రాయంలేకుండా మాధన్నపేట గ్రామాన్ని మునిసిపాలిటీలో విలీనం చేయవద్దని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ)నాయకులు కేశెట్టి సదానందం, కర్నెసాంబయ్య, జన్నురమేశ్, మార్తనాగరాజు, మహిళా సంఘం నాయకురాలు మార్త సుధపాల్గొన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐ(యూ)నాయకులు

ప్రతిభను వెలికితీయడమే నిజమైన విద్య

ప్రముఖ విద్యావేత్త సీఏ ప్రసాద్

నర్సంపేట టౌన్, అక్టోబరు 8 : బోధనల్లో నిత్యం నూతన విధానాలను అన్వేషిస్తూ కొనసాగాలని, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడమే నిజమైన విద్య అని ప్రముఖ విద్యావేత్త సీఏ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని లీడ్ గ్రంథాలయంలో కాసుల రవికుమార్ అధ్యక్షతన చదువులు- కొత్తదారులు అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పుస్తకాలు, గ్రంథాలయాల ఆవశ్యకతపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు నేర్పించడంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. కథలు, పాటలు, చిన్న చిన్న గేయాలతో పిల్లలకు చదువుపై ఆసక్తి పెంపొందించేలా చేయాలన్నారు. ఇటీవల ఆయన అమెరికాలో నిర్వహించిన వర్క్‌షాప్‌ల అనుభవాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకున్నారు. ఈ సదస్సులో డాక్టర్ జగదీశ్వర్, కొర్ర రమేష్, ఇసాక్, కాసుల శోభారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ విద్యావేత్త సీఏ ప్రసాద్

బతుకమ్మ ఉత్సవాలను సజావుగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీవాణి

చెన్నారావుపేట, అక్టోబరు 8: మండల వ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలను సజావుగా నిర్వహణ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీవాణి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ ఆట స్థలాల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఎస్సై రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలన్నారు. బతుకమ్మ ఆట స్థలాల వద్ద బందోబస్తు నిర్వహణ చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

పర్వతగిరి, అక్టోబరు 8: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళా పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ మహిళాసిబ్బంది, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బంది పలువురు మహిళాసంఘాల సభ్యులు కార్యాలయ ఆవరణలో అందంగా బతుకమ్మలను పేర్చి కోలాటాలు ఆడారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో మాలోత్ శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్, ఏపీఎం కృష్ణమూర్తి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


పర్వతగిరిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

విధులకు ఆటంకంపై ఫిర్యాదు

వరంగల్ సిటీ, అక్టోబరు 8: ఎస్ఆర్ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కేతిరి రాజశేఖర్‌పై ప్రభుత్వ అధికారులను అడ్డుకుని, విధులకు ఆటంకం కలిగించారని వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఎక్బాల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రెండు రోజుల క్రితం 14వ డివిజన్ ఎస్ఆర్ నగర్‌కు చెందిన యువకులు, మహిళలు వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజును కలిశారు. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలు జరుపుకునేలా ఎస్ఆర్‌నగర్ లోని గుడి వద్ద ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించి, చదును చేయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వరంగల్ తహసీల్దార్ ఎక్బాల్‌ను ఉత్స వాల కోసం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

తహసీల్దార్ మంగళవారం సిబ్బందితో కలిసి స్థల పరిశీలనకు ఎస్ఆర్‌నగర్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న కేతిరి రాజశేఖర్ తన కుటుంబ సభ్యులు, ఇండ్లు కూల్చివేసేందుకు అధికారులు వస్తున్నా రని అసత్య ప్రచారం చేసి స్థానికులను రెచ్చగొట్టారు. ఈ ఈమేరకు స్థానికులతో కలిసి రాజశేఖర్ తహసీల్దార్, సిబ్బందిని స్థల పరిశీలనకు వెళ్లకుండా అడ్డుకుని దాడికి యత్నించారు. దాంతో తహసీల్దార్ ఏనుమాముల పోలీస్ స్టేషన్‌లో రాజశేఖర్‌పై ఫిర్యాదు చేశారు. సీఐ రాఘవేందర్ కేసు నమోదు చేశారు.

హరీష్‌రావును కలిసిన రత్నాకర్‌రెడ్డి


మాజీ మంత్రి హరీష్‌రావుతో రత్నాకర్ రెడ్డి

రాయపర్తి, అక్టోబరు 8 : మండలంలోని బురాహన్‌పల్లి గ్రామానికిచెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు కార్దురి రత్నాకర్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసారు.

ద్విచక్రవాహనం ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు

చెన్నారావుపేట, అక్టోబరు8: ద్విచక్రవాహనం ఢీకొని రైతుకు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకొంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రైతు మండల మల్లయ్య వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మండల కేంద్రం నుంచి జల్లి వైపు వెళ్తున్న ద్విచక్రవాహన దారుడు సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో మల్లయ్య తలకు బలమైన గాయాలు కాగా, చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు

చెన్నారావుపేట, అక్టోబరు 8: మండల కేంద్రానికి చెందిన బొజ్జ పద్మ భర్త నర్సింహాలు ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబానికి చిన్ననాటి మిత్రులు రూ. 25 వేలను ఆర్థిక సాయంగా మంగళవారం అందించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో 1994- 1995 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన తోటి విద్యార్థులందరూ కలిసి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల యాదగిరి, చంద్రమోహన్, గంట ఇంద్రకర్ణాకర్, ప్రభాకర్, నిమ్మల సరస్వతి, ఎర్ర రవి, లక్ష్మణ్, బాలరాజు. మహేందర్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలో షార్ట్ సర్క్యూట్


పనికర జీపీలో అగ్నిప్రమాదంతో దగ్ధమైన రికార్డులు

నెక్కొండ, అక్టోబరు 8 : మండలంలోని పనికర గ్రామ పంచాయతీలో మంగళవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి కార్యాలయంలోని రికార్డులు దగ్ధమ య్యాయి. దీంతో దాదాపు రూ. 50 వేల వరకూ ఆస్తినష్టం జరిగింది. అయితే గ్రామ పంచాయతీ సమీపంలో దుర్గామాత దీక్షతీసుకున్న స్వాములు ఉండటంతో వెంటనే మంటలను నీటితో ఆర్పి అగ్నిప్రమాదం సంభవించకుండా నిలువరించారు. తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో దయాకర్, ఆర్ఐ నరేందర్, ఇన్‌చార్జి కార్యదర్శి ప్రియాంక జీపీ కార్యాలయాన్ని సందర్శించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గీసుగొండ, అక్టోబరు 8: ధర్మారం గ్రామానికి చెందిన సింగరబోయిన కుమారస్వామి(60) వృద్ధుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం కుమారస్వామి గొర్రెల మంద కాస్తూ జీవించేవాడు. మద్యానికి అలవాటు పడ్డ అతను ఈనెల 5న గొర్రెలను గ్రామ సమీపంలో మేపుకొని వచ్చి మద్యం సేవించాడు. అ మత్తులో గొర్రెలకు వేసే మందును కూడా తాగటంతో అస్వస్థతకు గురి కాగా కుటుంబీకులు ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ కుమారస్వామి మంగళవారం మృతిచెందాడు.

మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కుమార్ తెలిపారు.